


గ్లోబల్ హాస్పటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ

# నీలినీడలు

దాసరి శిరీష



ఎండపొడ కళ్లమీద పడి చురుక్కుమనిపించగానే మెలుకువ వచ్చింది గంగయ్యకి. మర్రిచెట్టుమీద రకరకాల పిట్టలు హడావుడి చేస్తూ తలోదిక్కు పరిగెత్తాయి. కాకుల గుంపొకటి గోలగోలగా అరుస్తూ... పైకీ కిందకీ వేగంగా తిరుగుతూ మధ్యమధ్య చెట్టు దగ్గర చేరిన జనాన్ని పరికిస్తోంది.

తల దిమ్ముగా ఉంది. కళ్లు నులుముకుని కండువా తీసి ఒకసారి దులిపాడు. "తాతా" అని మెత్తగా పిలిచే గొంతు ఈరోజు వినబడలేదు. మెల్లగా చెట్టు దగ్గర చప్టా మీదకి అందరూ చేరుతున్నారు. దూరంగా టీబండి ఆపి రాములు తన పనిలో బడ్డాడు. 'అయ్యో పిల్లాడేడి ఆ కాసిని టీ నీళ్లు పడితేగాని బండి కదల్దు" ... గొణిగాడు గంగయ్య. చేతులు అలవాటుగా వెనకాల చిన్న గుడ్డసంచీ ఉందో లేదో అని తడిమాయి. 'ఈ కాలంలో ఎవుడ్నీ నమ్మేదానికి లేదు' నిశ్చింతగా నిట్టూర్చి చుట్టూ చూశాడు.

ఒంటి కన్ను గుడ్డి నర్సయ్య గంగయ్య మావా! అనుకుంటూ వచ్చి పక్కనే కూలబడ్డాడు. చిరంజీవిగాడేడి అన్నాడు సంచీ పదిలంగా పెట్టుకుంటూ.

"ఆడికోసరమే సూస్తన్నానా పొద్దున్నే ఆడొచ్చి టీ గళాసిస్తేగాని నా ఒళ్లు అంకికి రాదు" ఆవులించాడు.

"ఈ మద్దె పొద్దున్నే ఆడే సొంతంగా చిత్తు కాగితాలూ సీసాలూ ఏరుకుంటూ అమ్ముతున్నాడంట. అప్పుడప్పుడూ అడుక్కోవటం గూడా..."

"ఛా... ఛా... అంత మంచీ చెడూ తెలీనోడు గాదు నా మనవడు. నాకు జెప్పకుండా ఏ పనీ జేయడు. నా కర్మమిట్టా గాలీ... ఆరోజు ఆక్సిడెంటు అయ్యి ఇట్టా దిక్కుమాలినోళ్లం అయాం గానీ... అసలు మావోళ్లెవరూ అడుక్కోలేదురా నర్సయ్యా!... గతంలోకి తొంగిచూసే ఓపిక లేక దృష్టి మళ్లించాడు. రకరకాల దృశ్యాలు వేపచెట్టు దగ్గర వీధివంపు దగ్గర నిలబడి రంగమ్మ స్నానం చేస్తోంది. తడిసిన చీరతో... వీపునిండా పరుచుకున్న నల్లటి పొడుగాటి జుత్తుతో... చిక్కిపోయిన రాజకుమార్తెలా ఉంది. పాపం ఎక్కువగా ఎవరితో మాటాడదు. అందరూ ఆ తల్లిని రాబందుల్లా పీక్కు తినేవాళ్లే. ఏం జన్మలో!

"యాంది మావో అదేపనిగా సూత్తన్నావ్. అదిపుడసలు ఎందుకూ పనికిరాకుండా... పోయిందసే..."

ఏదో ఆలోచిస్తున్న గంగయ్య "ఎదవ నా కొడకా!" అని కసిరాడు. ఆ తల్లి నా కూతుర్లాంటిది. బతుకట్టాగయింది పాపం. గుడ్డి నర్సయ్య ఓ పిచ్చినవ్వు నవ్వి సంచీలోంచి రకరకాల వస్తువులు బయటకు తీస్తూ... ప్రదర్శిస్తూ మళ్లీ లోపల సర్దుకుంటున్నాడు. పాతగుడ్డలూ... చిన్న చిన్న ఇనుప ముక్కలూ... తాళ్లూ... దారాలూ విరిగిన బొమ్మలూ... సంబరంగా చూసుకుంటూ ఉంటే చుట్టుపక్కల బిచ్చగాళ్లు అపురూపంగా, కుతూహలంగా చూస్తున్నారు. అందరూ అడుక్కునే వాళ్లు గాకపోయినా దాదాపు అంతే. కొంతమంది చిన్నా చితకా పనులు చేసుకుంటూ ఏ పనీ దొరకనపుడు అడుక్కుంటూ ఉంటారు.


ఎండ చెట్ల ఆకుల్లోంచి వేడిగా తాకుతోంది. గంగయ్యకి కళ్లు తిరుగుతున్నట్టుగా ఉంది. నిలబడ్డాడు గాని అడుగు ముందుకు వేయలేకపోతున్నాడు. అందరూ టీలు తెచ్చుకుని చప్పరిస్తుంటే మరీ నీరసంగా అనిపిస్తోంది. "గంగయ్యా! పిల్లాడింకా రాలేదా టీ ఏలయింది గదా!" కనకయ్య టీ చప్పరిస్తూ పలుకరించాడు.

"చిరంజీవిగాడెటో ఎల్లాడు పాపం. సరేగాని ఈ కబురు అందరూ

ఇనండెహే మద్దెనం అవతల వక్క సందులో పెద్ద షాపు వక్కనే... అన్నదానవంట! గుడ్డి నర్సయ్య అందించిన సమాచారానికి అందరి మొహాలూ వెలిగిపోయాయి. గంగయ్య ఆనందంగా "ఎవురు నాయినా ఆ పుణ్ణాత్ములు" అన్నాడు. 'ఎవురిదయినా పెద్ద దినవా...

తాపీగా చెట్టుకు చారగిలబడి బీడీ కాల్చుగుంటున్న ఓ సాధువు ఛా ఛా దినం కాదురా చవటల్లారా అంటూ మందలించాడు. నాయుడుగారని చాలా ఘనమైన మనిషి వారిది శతజయంతి. బీదాసాదా అందరికీ భోజనాలు వస్త్రదానం లేదనుకో అన్నదానమే అన్నాడు గంభీరంగా. ఆ జనానికి, అక్కడ చేరే రకరకాల మనుషులందరికీ... ఆ వృద్ధుడంటే భయం.... గౌరవమూను. "అయ్యగారా!" అంటూ పిలుస్తూ అప్పుడప్పుడు చేతులు చూపించుకుంటూ ఉంటారు. గంగయ్యకి వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది. కర్ర తాడిస్తూ గ్లాసు తీసుకుని కదలబోయాడు నర్సయ్య. గబుక్కున జరిగి గ్లాసూ... డబ్బులూ లాక్కుని "నేను తెచ్చిస్తా మావా కూశో మరీ అంత జాగర్త పనికిరాదు" అంటూ వెళ్లి టీ పోయించుకుని మెల్లగా రెండు గుటకలేసి నవ్వుకుంటూ వచ్చాడు. గంగయ్యకి ఆ దృశ్యం చూడగానే అరికాలివంట నెత్తికెక్కింది. "కక్కుర్తి నాయాలా నేనడిగాన్రా నిన్ను టీ తెమ్మని ఇట్లాంటి లత్తుకోరు పన్లు జేత్తావనే అసలు నీతో ... థూ... నీ జిమ్మడ..."

"ఏదో కుంటు నా కొడుకువని పోన్లే అని తెస్తే... ఎందుకురా అట్టా నా మీద పడేడుత్తావ్!" నర్సయ్య నవ్వులాపి కళ్లెర్ర జేశాడు. మిగిలినవాళ్లొచ్చి సర్ది శాంతపరిచారు. ఆత్రంగా గుటకలేస్తూ టీ తాగుతున్న గంగయ్యకి దూరంగా కనబడ్డ చిరంజీవిని చూడగానే చికాకంతా మాయమయింది. 'తాతా!' అనుకుంటూ చిరంజీవి దగ్గరకొచ్చి జేబులోంచి బన్ను తీసిచ్చాడు. ఒక ముక్క తుంపి మనవడికివ్వబోయాడు గంగయ్య. వద్దన్నట్టుగా నవ్వుతూ తలాడించాడు. వాడి అవతారం గంగయ్యకేమీ నచ్చలేదు. నీలంరంగు నిక్కరుమీద నీలం తెలుపూ కలిసిన చారల చొక్కా వేసుకున్నాడు. స్నానం చేశాడు కాబోలు... తల చక్కగా దువ్వుకుని ముద్దులు మూటకడుతున్నట్టు ముచ్చగా ఉన్నాడు. నాసేతికిందే ఉండి 'తాతా! తాతా!' అని కలవరించే ఈ బుడ్డగాడు ఏదో గొడవ తెచ్చిపెట్టేటట్టే ఉండాడు అనుకుని ఎగాదిగా చూశాడు.




"పొద్దుటేల నా పక్కన లేవు. అంత అర్జంటుగా ఎక్కడకి బోయావురా చిరంజీవా?

"అదిగో... ఆ ఆఫీసు లోపల కుళాయి దగ్గర స్నానం జేశాగా, సబ్బుపెట్టె కూడా అక్కడ దాచుకున్నా. ఇస్కూలుకి బోతన్నాను అంటే ఆ వాచ్‌మెన్‌గూడా ఏమీ అన్లేదు. రోజూ వచ్చి స్నానం జేయమన్నాడు" ఎగురుకుంటూ హుషారుగా నవ్వాడు.

"బడికా! అందరూ ఒక్కసారే ఆశ్చర్యంగా ప్రశ్నించారు. చిరంజీవికి ఏనుగెక్కినంత సంబరమయింది. మెరుస్తున్న కళ్లతో గర్వంగా "ఈరోజు నాపేరు గూడా రాసుకుంటారంట. ఇంకా నాలాటి పిల్లలుంటే తీసుకురమ్మంది మా టీచరమ్మ" అన్నాడు.

"గవుర్నెంటోడు బలంవంతంగా లాక్కెల్తన్నారంటగా."

"మనలాంటి దిక్కులేని పచ్చుల్ని ఆల్లెందుకు లెక్కలో తీసుకుంటారు! కూలీనాలీ జేసే జనాలయితే..." కనకయ్య తనకు తోచింది చెప్పాడు.

"లేదు. మా మందపాడులో నా కూతురు పిల్లలంతా సదువుతున్నారుగా. అందరికీ బియ్యం ఇత్తారంట. నేనెళ్లినప్పుడు ఆ బియ్యంతోనే భోంచేశాను చేపల పులుపెట్టింది."

"ఉండా డబ్బులన్నీ ఊడలాక్కుందని సెప్పావుగా అయ్యగోరా?" ఎవరో పరాచికమాడారు.

"ఆ... మరి... ఆడపిల్లకి ఆ మాత్రం ఆశ ఉండదా! సన్నాసిగాడిని నాకేం ఖర్చులుంటాయి!"... సాధువు దీర్ఘం తీస్తూ అక్కడ్నించి కదిలాడు.

"అస్సలు మాది. గవర్మెంటుది గాదు. బియ్యం ఇవరు. పొద్దున్నే టిఫిన్ పెడతారు. మద్దానం పెరుగన్నవో... పులిహోరనో ఏదో ఒకటి పెడతారంట. ఆల్లంతా శానా మంచోళ్లు తెలుసా?

“ఆ అది సర్కార్లోళ్లదేలే. ఎలచ్చన్లముందు ఇట్టాంటి దొంగ మాటలన్ని సెప్పుతార్లే నాయనా... నర్సయ్య ఈ మాటలనగానే గంగయ్య అతన్ని అప్పుడ్నే చూసినట్టుగా చూశాడు. ఒక్కసారిగా ఇరవయ్యేళ్లు వెనక్కు తిరిగి పూనకం వచ్చినవాడిలా అరుపులు మొదలెట్టాడు. “ఆ గవుర్నమెంటాడ్ని నమ్ముకునే నేనిట్టా అన్నీ పోగొట్టుకున్నాను. నా ఇల్లు పీకేశారు. సగం కాలుపోయి బతికి బయటపడ్డాక ఆల్లు జెప్పారనీ... ఈల్లు జెప్పారనీ... డబ్బులుకోసం పింఛను కోసరం



నేను తిరగని ఆఫీసుందా! దొంగ నా కొడుకులందరినీ డబ్బులు మేపాను. పేదోల్లకి గవర్మెంటేంటి నాయన్లారా? అసలు మనలాంటోళ్లకి ప్రెబుత్వం అనేది లేదు. మాయమాటలుజెప్పి ఇట్టాంటి సిత్రాలన్నీ జూపిచ్చి... మాయమాటలు జెప్పి... మోసాలు జేత్తారు. ఓట్ల గురించి మనసుట్టూ దిరుగుతారు” గంగయ్య ఆవేశం చాలాసేపటివరకూ చల్లారలేదు. గతం పుండులా సలుపుతోంది.

చిరంజీవికి మాటలు అర్థంగావు. వాడు ఎగురుకుంటూ “అదిగో ఆ రాజావారి సత్రం పక్కనే బడి నేనెల్లాలి తాతా వస్తానే” పరిగెత్తబోయాడు.

“అరేయ్ చిరంజీవిగా ఈ పగిటేల అన్నదానం ఉందిరా. మంచి బోజనం. ఆ టయానికి ముందే రారా... అసలు రేపుట్నించి ఎల్లువుగానిలే బాబు ఈ రోజుకి మానెయ్యరాదు నాయినా.”

“వామ్మో. ఇంకేమన్నా ఉందా! నాపేరు రాసుగుంటారుగా. ఆ శాయిగాడికి నీకు ఇడ్డీ తెచ్చిమ్మన్నాతే తాతా. ఆడే నిన్ను శాయిబాబా గుడికాడ కూశో బెడతాడు.... నేనెల్తన్నా”... తూనీగలా ఏదో పాడుకుంటూ రివ్వుమని పరిగెత్తాడు.

***

ఎండ చుర్రుమంటోంది. గుడిదగ్గర కూచున్న చాలామంది చలాకీగా నాయుడిగారి అన్నదానం దగ్గరకి పరిగెత్తారు. ఎవరూ గంగయ్య గురించి ఆలోచించడంలేదు. పైగా ఇంకెవరో పాతకాపు వచ్చి మెట్ల దగ్గర చోటు గురించి జగడమాడి తెగ బూతులు తిట్టాడు. వృద్ధాప్యం... అవిటితనం గంగయ్యని నిస్సహాయుడిగా చేస్తున్నాయి. ఏమీ అనలేక ఓ పక్కకి జరిగి కూచున్నాడు.

“అసలు లేసినేళే బాగోలేదు. రోజా చిరంజీవిగాడి మొహం చూసేవోడ్ని. కడుపు నిండిపోయేది. నా ప్రాణానికి ఈ సదువెక్కడొచ్చి పడిందో? అయినా అడుక్కు తినేవోళ్లకి ఓపిగ్గా సదువు సెప్పే మా తల్లులెవరో! ఇదంతా తన కర్మకి వచ్చింది.” గంగయ్య బరువుగా నిట్టూర్చి అతికష్టంమీద లేచి నిలబడ్డాడు. గుడిదాటి గాంధీ సెంటరుకి వచ్చేసరికి చాలామంది తెలిసినోళ్లు కబుర్లు చెప్పుకుంటూ ఎదురొచ్చారు. అందరి చంకల్లో జోలెలున్నాయి. లేదా సంచులున్నాయి. మొహాలు కళకళలాడుతున్నాయి.

ఈళ్లంతా విందు భోజనం చేసుంటారనుకునేసరికి గంగయ్య నోట్లో నీళ్లూరాయి. అదురుష్టవంతులూ అందరూ నాలాగా కుంటోళ్లు గారు. ముందె ఎల్లి తిన్నారు అనుకుంటూ నడవసాగాడు.

గంగయ్య తాతా! చిరంజీవిగాడేడి? ఆడ్ని పిల్సుగుపో. అబ్బో ఏం బెడతన్నార్లే. గారెలూ, బూరెలూ... పాయసం... అడుక్కునే ఓళ్లకి ఇంత ఘనంగా ఎవరూ పెట్టర్రా. ఆ పిల్లగాడ్ని తీసుకుని యావన్నా గిన్నెలుంటే అట్టగునిబో గిన్నెలు కనబడనీబాకు. గుడ్డలో ఏసుకో... నేస్తాలంతా రకరకాల సలహాలు చెప్పి కదిలారు.

వాళ్ల మాటలు విన్నాక గంగయ్యకి ఆకలి పెరిగింది. ఎట్టాంటి బతుకు నాది! ఈ రోజున మంచి భోజనానికి గూడా ఎల్లలేనట్టుగా ఉంది నా పరిస్థితి. ఇస్కూలుకాడి దగ్గరికి బోతే ఆడ్ని ఆ పాడుబడ్డ కూలిపోయిన బిల్డింగుకాడికి పంపొచ్చు. ఆ తువ్వాల్లోనే తమ సామానుంది. తినబోయే రుచుల గురించి ఊహించుకుంటూ గంగయ్య అతికష్టంమీద రోడ్డుదాటారు. దాటిం తర్వాత కూడా గుండెదడ తగ్గలేదు. ఈ నాయాల బడి ఎక్కడో... అటూ ఇటూ చూశాడు. తెలిసిన పిల్లలిద్దరు గంగయ్యని చూసి ఆగారు. చింపిరిజుత్తు... మురికోడుతున్న బట్టలు ఆళ్లందరికన్నా తన బిడ్డ రాజాలాగా ఉంటాడు. గంగయ్య ‘అరేయ్ రమేషా!’ అని పిలిచాడు.

“మీ చిరంజీవిగాడా అదిగో బడి అదేగా ఆ తురాయి చెట్టుకాడ...” వాళ్లిద్దరూ పరిగెత్తబోయారు.

“బాబ్బాబు కాస్త పిలవండ్రా శానా అరజెంటు”. “ఓర్నాయినో. మేం కనిపిత్తే ఆయాలూ... టీచరమ్మలూ వదిలిపెట్టరు. సదువుకోమంటారు మంచి బడే గానీ...

“నీ యమ్మా ‘సదువూ... పిల్లాడ్ని నాగ్గాకుండా చేస్తన్నారు టీ గావాలన్నా.... తిండి దినాలన్నా ఆడులేందే నా కెట్టా సాగుద్ది. కాస్త పిలవండ్రా బంగారు తండ్రులూ.”

“అమ్మో. వేం రైలుటేషన్‌కి ఎల్లాల బండొచ్చిద్దిగా” వాళ్లిద్దరూ పరుగందుకున్నారు.

ఇంతమాత్రం గ్నేనం (జ్ఞానం) ఆడికి లేకపోయింది. ఎందుకా సదువు? కూటికా? గుడ్డకా? గంగయ్య పగరుస్తూ ఆ స్కూలు దగ్గరకెళ్లి బయట బండరాయి మీద కూలబడ్డాడు. లోపలికెళ్లబోతున్న ఓ వృద్ధురాల్ని ఇదిగో తల్లా? అని ప్రాధేయపడుతూ పిలిచాడు. ఆమె కళ్లకి చేయి అడ్డం పెట్టుకుని యాంటి ముసలాయనా? అంటూ దగ్గరకొచ్చింది. “ఆ

## అంత పని చేశాడా?

జెస్సికాహీన్స్ అనే లండన్‌వాసిని అయిన యువతితో చాటుమాటు వ్యవహారం సాగించాడు ఆమీర్. మొన్నీ మధ్యనే ఆవిడకో అబ్బాయి పుట్టాడు. జాన్ హారీహీన్స్ అతని పేరు. ఒంటరిగా తనా బిడ్డను పెంచగలననీ, తండ్రి లేకపోయినా పరవాలేదనీ ఆవిడ ఒకానొక పత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో అందిట. ఆ బాబుకు మనవాళ్లలా నల్లని ఒత్తయిన జుట్టు వుండటం, ఎక్కడో తల్లితో పాటు తండ్రి (?) పోలికలూ కనిపించాయని మీడియా వాళ్లంతా చుట్టూ గుమిగూడి మరీ చూశారట. ఎంత హడావుడి జరుగుతున్నా, మొబైల్ ఆఫ్ చేసి, నిమ్మకు నీరెత్తినట్లు పెదవి కదపటం లేదట ఆమీర్. కానీ... చాటుగా లండన్ వెళ్లినప్పుడు ప్రియురాలినీ, బిడ్డనూ చూసొచ్చాడని గుసగుసలు వ్యాపిస్తున్నాయి.

మధ్య మరీ 'వడుసు పిల్లవనీ'... ఒళ్లు మండినా గంగయ్య ఆ మాటలు పైకనలేదు. తన గోడంతా బతిమిలాడి చెప్పుకున్నాడు. అంతావిని "ఆమె నువ్వు గంగయ్యవు కదూ!" అంది. ఆ పలకరింపుతో ఎంతో శక్తి వచ్చినట్టయింది. ఈ మహానగరంలో తనని గుర్తుపట్టే వాళ్లున్నారా తన బతుకే కాలిపోయింది. చెట్టుకొకరూ పుట్టకొకరూ అయిపోయారు.

"గంగయ్యా నువ్వింకా బతికే ఉండావా?" ఆమె సంభ్రమంగా చూసింది. నేనీ స్కూల్లోనే ఆయాగా జేత్తన్నా. నేను రాజమ్మని. ఆ నువ్వు లారీమీద డ్యూటీకెల్లాక ఏదో దేశం గాని దేశంలో యాక్సిడెంటయి సచ్చిపోయావని... చాలా సంవత్సరాలు..

"అవును సచ్చిపోయి మళ్లీ బతికాను. అవ్మా నువ్వెవురివో సరిగ్గా జ్ఞప్తికి రావట్లేదుగానీ... నా మనవడు చిరంజీవి ఇక్కడే జేరాడు. అనాథ పిల్లల బడిగదా!..." ఏడీ ఆడని కేకెయ్యి.

"నీ మనవడా ... మీ ఆవిడ వైజాగు.."

"మళ్లీ నేను బెజవాడ జేరుకునేసరికి ఎవురూ లేరులే. ఇళ్లన్నీ నేలమట్టమయ్యాయి. వద్దులేమ్మా. అదంతా వద్దు. ఆ పైవారి పిలుపు కోసం జూస్తన్నా. నా టయిమయిపోయింది. నీగు పుణ్ణెం ఉంటది. ఆడ్ని కేకెయ్యితల్లా... అమ్మమ్మా..." నిట్టూర్చాడు గంగయ్య.

రాజమ్మ దిగ్భ్రాంతిగా చూస్తూ విచారంగా లోపలికి నడిచింది. ఏనాడో గంగయ్య... లారీ డ్రయివర్ భార్యగా హాయిగా బతికిన కనకాలు ఇల్లూ వాకిలీ మాయమవడంతో ఎవరితోనో పిల్లలితో సహా వెళ్లిపోయింది. గంగయ్య పాపం ఇప్పుడు దిక్కులేని వాడయ్యాడు. ఏం బతుకులో! ఎందుకు పుడతారో తమలాంటివాళ్లు? తనకీ వయస్సులో కనీసం ఈ ఆధారమన్నా దొరికింది. పాపం గంగయ్య... కాలుబోయి... ప్చ్... ప్చ్... ఎన్నెన్నో గుర్తు చేసుకుంటూ రాజమ్మ దిగులుపడింది.

కాలు నొక్కుకుంటూ ఆత్రంగా లోపలికి చూస్తున్నాడు. ఆకలి మరీ వేధిస్తోంది... ఎవరో ఆడకూతురితో మాట్లాడుతూ వస్తున్న చిరంజీవిని చూసి పరమానందభరితుడయ్యాడు గంగయ్య. ఎన్నో సంవత్సరాలకి కలిసినవాడిలా "నాయినా రారా" అన్నాడు ఆవేదనగా. చిరంజీవి తన భుజం చుట్టూ చేయి వేసిన టీచర్ వైపూ తాతవైపూ చూస్తూ ఇబ్బందిగా నవ్వాడు. ఆమె గంగయ్యని చూస్తూ దయగా నవ్వింది.

"తాతా చిరంజీవి నీకేమవుతాడు?"

"నా మనవడమ్మా!"

"మనవడంటే చిరంజీవి తల్లి నీ స్వంత కూతురా!"

అదేం ప్రశ్న అన్నట్టు నిర్లక్ష్యంగా చూశాడు. ఎల్లాం రారా తండ్రీ తన బ్యాగూ తెద్దువుగాని అన్నాడు రహస్యంగా.

"తాతా రాజమ్మ నాకన్నీ చెప్పింది. పిల్లాడి వివరాలు నువ్వు చెబితే రాసుకుంటాము. ఇంటిపేరూ.. ఊరిపేరూ"

గంగయ్య తెల్లబోయాడు. ఇంటిపేరా! ఏమో తనకేం తెల్సు? ఓవర్ బ్రిడ్జి కింద ఉన్నప్పుడు చిరంజీవి తల్లి సొంత కూతురిలా తనని

(మిగతా 31వ పేజీలో)


# పచ్చకామెర్లా ?

జాండిస్ (పచ్చకామెర్ల వ్యాధి) కి ఖచ్చితమైన, సత్వర పరీక్షలు ఎంతో అవసరం!

వీటిలో ఏ లక్షణాలతోనైనా బాధపడుతున్నారా?

- కళ్ళు/చర్మం/మూత్రం పసుపుపచ్చగా ఉండటం
- తల తిరగడం / వాంతులు
- ఆకలి మందగించడం / బరువు తగ్గడం
- కడుపులో నొప్పి
- కాళ్ళు / పొట్టవాపు
- చలి, జ్వరం
- రక్తంతో కూడిన వాంతులు
- రంగులేని తెల్లని మలం
- దురదలు






నాటు వైద్యం, చిట్కావైద్యం ప్రాణాంతకం కావచ్చు

స్పెషలిస్టును సంప్రదించడం, చికిత్స చేయించుకోవడం ఒక్కటే సరైన మార్గం.

వెంటనే కాలేయ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులను (లివర్ స్పెషలిస్టు) సంప్రదించండి !!

EMERGENCY 24 Hrs SERVICE

EXCELLENCE THROUGH TEAM WORK

జాండిస్ (పచ్చకామెర్లు) రావడానికి ప్రధాన కారణాలు :

- హెపటైటిస్ ● వైరస్, మద్యం, మందులు, విషపదార్థాలు ● గాల్ బ్లాడర్ (పిత్తాశయం), పైత్యరసనాళం (బైల్ డక్టు) లో రాళ్ళు
- మెటబాలిక్, స్టోరేజ (జీవనక్రియ), పుట్టుకతో వచ్చే సమస్యలు ● కాలేయం, ప్యాంక్రియాస్, గాల్ బ్లాడర్‌ల కాన్సర్

ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్:

- నైపుణ్యత కలిగిన శస్త్రచికిత్స నిపుణులు ● ప్రత్యేక కాలేయ నిపుణులు (హెపటాలజిస్టులు)
- హాస్పిటల్ ఆవరణలోనే అన్ని వ్యాధినిర్ధారణ పరీక్షలు ● అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లు / ఇన్‌టెన్సివ్ కేర్

సంప్రదించండి ఫోన్ : 23234567

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

గుర్తింపు :
ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎఫ్.సి.ఐ
ఎ.పి.జెన్‌కో, సి.పి.డి.సి.ఎల్ బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి

గ్లోబల్ హాస్పిటల్స్

సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే,
ఎన్.టి.పి.సి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కొలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

(27వ పేజీ తరువాయి)

ప్రేమగా చూసుకునేది. ఆ తర్వాత ఈడ్ని కన్నాక మళ్లీ వెంటనే రెండో కానుపులో బాలింతరాలి జబ్బుచేసి చచ్చిపోయింది. ఆ బిడ్డా పోయింది. సాటి ఆడకూతుళ్లు ఈడ్ని పాలిచ్చి సాకి తనకప్పజెప్పారు. ఇదంతా ఈళ్లకి జెప్పాలా? ఈళ్లకెందుకూ... సదువు జెబుతున్నారనా? మరి ఆ రోజుల్లో తనూ ఆరోక్లాసు సదివాడు. తనతోటివాళ్లకి ఎవురికీ ఆ విషయం తెలియదు. నానాపాట్లు పడుతూ సివరికి ఏవయ్యాడు! ముసిలాడయ్యాడు. రేపో మాపో సచ్చిపోతాడు.

"అంతేగా?"


అనుభవశీలీ... సహనమూర్తీ.. టీచర్ పద్మ అన్నీ తృటిలో గ్రహించింది. తమ సంస్థ గురించీ.. పిల్లల గురించీ మృదువుగా చెప్పడం ప్రారంభించింది. ఆకలితో మరిపిస్తున్న కళ్లతో చూసి "భలే తల్లులవమ్మా!" అన్నాడు వెటకారంగా. రాజమ్మ దూరంగా నిలబడి కుతూహలంగా చూడసాగింది.

"మేమిద్దరం ఇప్పుడు భోజనాలకి ఎల్లాల. ఈ పిల్లాడు లేందే ఒక్క నిమిషం జరగదు నాకు. అయినా మా బిడ్డని మాకిష్టం లేకుండా ఎట్టా సదివిస్తారు టీచరమ్మగారా? మాకీ సదువులు అచ్చిరావు. పంపిచ్చెయ్యి మావోడ్ని. నాయినా ఆ బిల్డింగెనకమాల"... చిరంజీవికి అర్థమయి ఉండాలన్నట్టు అర్థోక్తిలో ఆపాడు. చిరంజీవి ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు.

పద్మ చిరంజీవిని లోపలికెళ్లమని సైగ చేసింది. చిరునవ్వుతో గంగయ్యవైపు తిరిగి తమ ఉద్దేశాలు చెప్పడం ప్రారంభించింది. తాత గురించి జాలి పడుతూ చిరంజీవి వెనక్కు తిరిగి చూసుకుంటూ... చూసుకుంటూ కదిలాడు.

గంగయ్యకి పూర్తిగా ఓపిక నశించింది. "అయ్యో! నా బిడ్డ. ఆడు కమ్మగా దినీ... నాకు అమర్చి పెట్టేవాడు. ఈ తల్లెవరు తినే కూట్లో దుమ్మేస్తంది. అసలీమెకేం సంబంధం?

పిల్లలు ఎలా ఎదగాలో వాళ్ల మనస్సులు ఎంత సున్నితమయినవో చెబుతోంది ఆమె. చదువు మనిషికెంత విశ్వాసాన్నిస్తుందో ఓపిగ్గా మళ్లీ వివరించడం మొదలెట్టింది.




"చాల్చాలేవమ్మా. మా కడుపులు మాడుస్తున్నావు."

లేదు గంగయ్యా. పిల్లాడి వివరాలు చెప్పు. వాడు నీ స్వంత మనవడు కాదని తెలుసులే. అయినా పిల్లలందరూ అన్నం ఇప్పుడే తినేశారు. సాయంత్రం పంపిస్తాలే. ఎంత ఇంకో రెండు గంటలు. అంతే. మీ మంచి కోసమే అసలీ స్కూలు...

గంగయ్య అరుపులు మొదలుపెట్టాడు. నాకు కాలు ఏయిస్తారా? ఇల్లు కట్టిస్తారా? తిండి పెడతారా? అదేదో కాలు ఉచితంగా ఇస్తారని తిరగని సోటు లేదు. ఏనా కొడుకూ సహాయం చేయలేదు. మా బతుకులే అధ్వానం అయినాక ఈ సదువులెందుకు తల్లీ. అడుక్కుతినే వాళ్లం. దిక్కులేని పచ్చులం (పక్షులం).

చిరంజీవి వినోదంగా చూస్తూ మళ్లీ వెనక్కి వచ్చాడు. ఈ గొడవ వాడికి సరదాగా ఉంది. చిరంజీవినీ.... గంగయ్యనీ చూసి టీచర్ సహనంగా నవ్వింది. అలా ఎప్పుడుబడితే అప్పుడు ఎవరూ రాగూడదన్నట్టు మెల్లగా వివరించడం ప్రారంభించింది. గంగయ్య అదేమీ వినిపించుకోకుండా 'ఈ ఒక్కసారికి రారా చిరంజీవా!' అంటూ ప్రాధేయపడ్డాడు. చివరికి ఒళ్లువుండి కర్రతో కొడతానన్నట్టు హూంకరించాడు.

స్ట్రీట్ చిల్డ్రన్ గురించి ఎంతో అంకితభావంతో పనిచేస్తున్న పద్మలాంటి వాళ్లకి గంగయ్య సమస్య అర్థమవాల్సినంతగా అర్థం కాలేదు. తిడితే తిట్టాడ్లే అనుకుంటూ చిరంజీవికి కళ్లతో సైగచేస్తూ నిలబడిపోయింది.

"నీయమ్మా సదువులూ..." ఇంక లాభం లేదన్నట్టు గంగయ్య రౌద్రంగా వెనక్కు దిరిగాడు. ఈ గంగయ్య సంగతి తెలీదు ఈ టీచరమ్మకి. రాత్రికి రాత్రే ఈడ్ని రైలెక్కించుకుని ఎల్లిపోతే యాంజేసుద్దీ. ఎంట బడుద్దా? మకాం ఎత్తేస్తాను సూస్తాను ఈళ్ల సంగతి... తిట్టుకుంటూ సణుక్కుంటూ రోడ్డుమీదకి వచ్చాడు. భోజనాలయిపోయాయో ఉండావో శానా టయిమయింది. గబగబా రోడ్డు దాటబోయాడు. కర్రజారిపోయింది. వాహనాలన్నీ కీచుమంటూ ఆగిపోయాయి. అరెరే అంటూ అందరూ ఖంగారుగా చూశారు.

స్కూటర్ మీద వెళుతున్న కుర్రాడు ఎంతో దయగా లేపి కూచోబెట్టాడు. అనునయంగా ప్రశ్నించి కాఫీ తీసుకొచ్చి తాగించాడు. గంగయ్య చెబుతున్న అన్నదానం జరిగే చోటుకి మెల్లగా చేర్చాడు. ■

## మిస్టర్ రైట్ దొరికాడు!

సినీనటుణ్ని కాదు కానీ, సినీరంగానికి చెందిన వాణ్నే 'మస్త్ మస్త్' గర్ల్ రవీనాటండన్ ఎంచుకున్నది. అతనో డిస్ట్రిబ్యూటర్. పేరు అనిల్ తడానీ. ఈ ఇద్దరూ చాటుమాటుగా కూడా ఏమీ కాదు, అందరి ముందూ హాయిగా కలుసుకునేవారు. చివరికి పెళ్లాడదామని నిర్ణయించుకున్నారు. ఇప్పుడేదో బిజినెస్ ట్రిప్ మీద విదేశాల్లో పర్యటిస్తున్న రవీన తిరిగి రాగానే, ఆ ఇంట్లో శాదీ తాలూకు 'శహనాయీ' వినిపిస్తుం దంటున్నారు.

